మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# రాజకీయాలకతీతంగా అభివృద్ధి

- ప్రతి రూపాయి పారదర్శక వినియోగమే లక్ష్యం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- 2026-27 తొలి కార్పొరేషన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్




2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్ తదితరులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి28, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ నగర అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్ నగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్పొరేషన్‌గా మారిన తర్వాత ప్రవేశపెట్టిన తొలిబడ్జెట్ కావడంతో దీన్ని సమర్థవంతంగా అమలు చేసి నగరానికి అద్భుతంగా అభివృద్ధి చేద్దాం అన్నారు. గతంలో బడ్జెట్‌లో ఉన్న లోటును దశలవారీగా భర్తీ చేయడానికి కృషిచేయాలని, ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నగర అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యం కాదని, అందరి భాగస్వామ్యంతోనే సాధ్యం అని ఆయన పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ఆదాయ వనరులను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, పన్నుల వసూళ్లను పెంపొందించాలని సూచించారు. ముఖ్యంగా ఆస్తి పన్నుల వసూళ్లు 100 శాతం జరిగితేనే ప్రతిడివిజన్‌లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నుంచి వసూలు చేసే ప్రతి రూపాయి ఖర్చు పారదర్శకంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎటువంటి దుర్వినియోగం జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని, నిధులను సమర్థవంతంగా వినియోగిస్తేనే మహబూబ్ నగర్‌ను రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దవచ్చని ఆయన స్పష్టం చేశారు. రానున్న ఐదు సంవత్సరాల పాటు మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజలకు సేవ చేసే అవకాశం మీకు లభించిందని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారి మన్ననలు పొందాలని ఆయన సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. సభలో అభినందనలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో నగరం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఇతరులు పాల్గొన్నారు.

## లక్ష్య ఛేదనకు నిరంతర సాధన చేయాలి

జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**మద్దూరు, మార్చి 28 ప్రభాతవార్త:** విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య ఛేధనకు నిరంతర సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం మద్దూరు మండలంలోని పెదిరి పాడ్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీబాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలోని వంట గది, మరుగు దొడ్లు, స్టాక్ రూమ్, ఆర్వో ప్లాంట్ ను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఎనిమిదో తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థినిలతో ముచ్చటించారు. పాఠశాలలో భోజనం, ఇతర వసతి సౌకర్యాలు, చదువుగురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్నిబాగున్నాయని విద్యార్థినిలు కలెక్టర్‌కు తెలిపారు. ప్రతీవారం సినిమా చూస్తున్నారా అని ఆరా తీశారు. ఇకపై ప్రతీ శనివారం విద్యార్థినులకు పాఠశాలలో మంచి సందేశాత్మక సినిమాలను చూపించాలని ఎస్.వోకుఆయన సూచించారు. తరగతి గదిలోని విద్యార్థినుల జీవితాశయం, లక్ష్యం గురించి ఒక్కరిని అడగడంతో కొందరు ఐఏఎస్, ఐపీఎస్, మరికొందరు డాక్టర్ అవుతామని తెలపగా ఆర్కిటెక్, సైంటిస్ట్ లు ఎవరూ కారాఅని ప్రశ్నించారు. కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళాలని సూచించారు. వారి వారి పుస్తకాల్లో విద్యార్థినుల పేర్లు రాయించారు. తరువాత పేర్ల ముందు వారు ఏం కావాలని అనుకుంటున్నారో ఆ డీజిగ్ నేషన్‌ను రాయించి, రోజూ పుస్తకం తెరిచి చూస్తే తాము భవిష్యత్తులో ఆ డీజిగ్ నేషన్ చేరుకునేందుకు కష్టపడి చదవాలని తెలిపారు. కేవలం కలెక్టర్, డాక్టర్, ఇంజినీర్ అవుతాం అనుకుంటే సరిపోదని, ఆ స్థాయిని చేరుకునేందుకు ప్రణాళిక ప్రకారం చదువు కోవాలన్నారు. అనంతరం అక్కడున్న వైద్యులతో మాట్లాడి పాఠశాలలో విద్యార్థినిలు ఏఏ రుగ్మతలతో బాధపడుతున్నారని, వారిలో ఏఏ ఆరోగ్య సమస్యలు గుర్తించారని అడిగి తెలుసుకున్నారు. ఎనీమియా సమస్యతో ఉన్న విద్యార్థినిలు ఎక్కువగా ఉన్నారని, అందుకు తగిన మందులను ఇస్తున్నామని, ఆహారాన్ని పెట్టిస్తున్నామని -మిగతా4లో..

# ఆధునిక సాగు పద్ధతులు లాభదాయకం

- రైతులు లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



వ్యవసాయ ప్రదర్శనలను పరిశీలిస్తున్న కలెక్టర్

**బిజినేపల్లి, మార్చి 28 ప్రభాతవార్త :** అధిక సాంద్రత కలిగి పత్తి సాగు చేస్తే రైతులకు మేలైన దిగుబడి తోపాటు పంట లాభదాయకంగా ఉంటుందని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం రైతులకు అధిక సాంద్రత పత్తి పంట సాగుపై కిసాన్ మేళా, పంట ప్రదర్శన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ లాభదాయక పంటల సాగుపై రైతుల దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో వేసిన పంటలే వేయకుండా పంట మార్పిడి చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో రైతులందరూ వరి సాగుపైనే ఎక్కువ దృష్టి పెడతారని దీనివల్ల నాలుగు నెలల్లో వచ్చే ఆదాయం అనుకున్న దానికంటే చాలా తక్కువగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఉన్న వ్యవసాయ క్షేత్రంలో కొంత భాగంలో వరి వేసుకుని మిగతా భాగంలో పంట మార్పిడితో కూరగాయలు పండించడం, వివిధ రకాల తోటల పెంపకం, పండ్ల తోటలు, ఆయిల్ పామ్ సాగుచేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు సాంప్రదాయ పద్ధతులను వీడి, డ్రోన్ల వినియోగం, సూక్ష్మ నీటిపారుదల, శాస్త్రీయ సాగు విధానాల వంటి ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు అని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలి, దీని వల్ల అనవసరపు ఖర్చు తగ్గుతుంది అన్నారు. ఈ విధానాలు నేల సారాన్ని కాపాడుతూ, సమయాన్ని ఆదా చేస్తాయి తెగుళ్ల ఉధృతిని తగ్గించి దిగుబడిని పెంచుతాయి అన్నారు. రైతులు ఒకే రకమైన పంట పండించకుండా, పంట మార్పిడితో అధిక సాంద్రత కలిగిన పత్తి సాగు వల్ల ఎకరానికి సుమారు 25 వేల మొక్కలు వస్తాయని, తక్కువ పంట కాలం వల్ల ఒకేసారి పంట కాలం వల్ల ఒకేసారి పంట తొందరగా చేతికి అందుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు తెలిపిన ప్రకారం రైతులు లాభదాయకమైన అధిక సాంద్రత కలిగిన పత్తి పంట సాగు చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులను కోరారు. ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును ఎక్కువగా ప్రచారం చేస్తోందని, రైతుకు -మిగతా4లో..

## గద్వాల జిల్లా మూడో స్థానం

రాష్ట్రంలో యాసంగి క్రాప్ బుకింగ్ 94.76 నమోదుతో

- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



క్రాప్ బుకింగ్ నమోదు వివరాలను చూస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

**గద్వాల మర్చి 28, ప్రభాతవార్త:** యాసంగి క్రాప్ బుకింగ్ ఈనెల 30న ముగియనున్న జిల్లాలో నమోదు ప్రక్రియ వేగవంతం చేసి వంద శాంతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగి సీజన్‌లో జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 1,73,707 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు గుర్తించామని తెలిపారు. అందులో భాగంగా ఇప్పటివరకు 1,64,603 ఎకరాలకు క్రాప్ బుకింగ్ పూర్తి కాగా, 94.76 శాతం నమోదు సాధించి రాష్ట్రస్థాయిలో జిల్లా మూడవ స్థానంలో నిలవడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ఫలితానికి మండల స్థాయిలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల సమిష్టి కృషి కారణమని కలెక్టర్ అభినందించారు. ఇంకా జిల్లాలో 9,104 ఎకరాల నమోదు మిగిలి ఉండగా, రెండు రోజుల్లో క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. డిజిటల్ క్రాప్ సర్వే నుమార్చి 30లోగా పూర్తిచేయాలని సూచిస్తూ, ఈ ప్రక్రియలో వ్యవసాయ విస్తరణ అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి పూర్తి పారదర్శకతతో రైతుల పంటల నమోదు చేపట్టి రైతులకు చేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## మాజీ ఎంపీపీ లింగప్పపై దాడి

- దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- జాతీయ మాలల ఐక్యవేదిక డిమాండ్



గాయపడిన మాజీ ఎంపిపి లింగప్ప

**దామరగిద్ద, మార్చి28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని చేగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లింగప్పపై జరిగిన దాడి ఘటనను ఖండిస్తూ, దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని జాతీయ మాలల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం దామరగిద్ద మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాంగ్ హనుమంతు, జిల్లా అధ్యక్షులు కోటకొండ రాములు మాట్లాడుతూ గ్రామంలో ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసే క్రమంలో, సర్పంచ్ తనయుడు సంజీవరెడ్డి గుంతలు తవ్విస్తున్న సమయంలో, లింగప్ప తన ఇంటి ముందు కాకుండా కొద్దిగా ముందుకు ఏర్పాటు చేయాలని సూచించగా వివాదం తలెత్తిందన్నారు. ఈ వివాదం ఒక్కసారిగా దాడికి దారి తీసిందని, లింగప్పపై కాకుండా అడ్డువచ్చిన ఆయన భార్య, కుమారుడిపై కూడా దాడి జరిగిందని ఆరోపించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్తుండగా, నిందితులు కారును వెంబడించి అద్దాలు పగలగొట్టి, చంపేందుకు ప్రయత్నించారని తెలిపారు. అదేవిధంగా, కులం పేరుతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఈ ఘటనపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి, దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. మాజీ ఎంపీపీ లింగప్ప కుటుంబానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దని నాయకులు భరోసా ఇచ్చారు.

## సామాన్యుడికి తప్పని..

# వంటగ్యాస్ కష్టాలు



### అదునుచూసి దోచుకుంటున్న గ్యాస్ ఏజెన్సీ డీలర్లు?

**నవాబుపేట, మార్చి 28 ప్రభాతవార్త:** సామాన్యులకు వంట గ్యాస్ తిప్పలు తప్పడం లేదు. అంతర్జాతీయ యుద్ధ ప్రభావం వంట గ్యాస్ పై పడింది. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న డీలర్లు కొరత సాకుతో సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నారు. ఈ క్రమంలో సిలిండర్ బుక్ చేసినా కుండ దొరకాలంటే దాని కోసం నానా తిప్పలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం మార్కెట్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ అధికారిక ధర సుమారు రూ.950 ఉంది. కానీ, డీలర్లు స్టాక్ లేదు అనే సాకుతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదే సమయంలో అదనపు డబ్బులు చెల్లించే వారికి మాత్రం గుట్టుచప్పుడు కాకుండా సిలిండర్లు సరఫరా చేస్తున్నారనే వార్తలు నవాబుపేట మండల కేంద్రంలో వినిపిస్తున్నాయి. ఫలితంగా రూ.900లకు రావాల్సిన సిలిండర్, బ్లాక్ మార్కెట్లో డీలర్ల ఇష్టానుసారంగా రూ.1,800 నుంచి రూ.2,800 రూపాయల వరకు తీసుకుని హోటళ్లకు దాబాలకు విక్రయిస్తున్నారని వాపోతున్నారు. వినియోగదారుల అసహాయతను పెట్టుబడిగా మార్చుకొని డీలర్లు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. సరిగ్గా ఇలాంటి సమయాన్నే వ్యాపారస్తులు డీలర్లు తమలాభాల కోసంహోటళ్లకు దాబాలకు విక్రయిస్తున్నారని కొందరు చెప్పకనే చెబుతున్నారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ దందాలో డెలివరీ బాయ్స్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పలువురు డెలివరీ బాయ్స్ తమ కుటుంబ సభ్యులు, తెలిసిన వారి పేరిట గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉన్నట్లు తెలిసింది. ఆ కనెక్షన్ల ద్వారా రీఫిల్ బుక్ చేసుకోవడం, వాటిని హోటళ్లు, ఇతర కమర్షియల్ అవసరాలుఉన్న వారికి రెట్టింపు ధరకు విక్రయించి సొమ్ము చేకుంటూ వస్తు న్నారని మండల వాసులు వాపోతు న్నారు. ప్రస్తుతం గ్రామీణ వినియోగ దారు 45 రోజులు, పట్టణ వినియోగ దారు 25 రోజుల తర్వాత సిలిండర్ బుక్‌చేసుకోవాలనినిబంధన విధించారు. ఇదివరకు ఈ నిబంధన లేకపోవడంతో ఇష్టారాజ్యంగా బుక్ చేసుకోవడం.. సిలిండర్లు పొందడం, ఎక్కువ ధరకు అమ్ముకోవడం పరిపాటిగా మారిపోయింది. వీరితోపాటు కొందరు వ్యక్తులు సంపాదన కోసం అనధికారిక గ్యాస్ సిలిండర్ల వ్యాపారం ఎంచుకున్నారు. వీరు కుటుంబ సభ్యులు, బంధువర్గీయుల పేరిట గ్యాస్ కనెక్షన్లు తీసుకోవడం.. తద్వారా రీఫిల్ పొంది సిలిండర్లతో డొమెస్టిక్ సిలిండర్ల నుండి కమర్షియల్ సిలిండర్లలోకి నింపడం జరుగుతుందని కిలోల చొప్పున భారీ మొత్తంలో విక్రయించుకుంటున్నారని పలువురు చర్చించుకోవడం మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది.



హోటళ్లలో వాడుతున్న సిలిండర్లు

## పారదర్శకమైన పాలన అందించడమే లక్ష్యం

- దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర, మార్చి 28ప్రభాతవార్త:** పారదర్శకమైన పాలన అందించడమే మా లక్ష్యం అని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి రూపాయి వినియోగంలో స్పష్టత, బాధ్యతతో పనిచేస్తున్నాం. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అందరికీ సమానంగా చేరేలా కట్టుబడి ఉన్నాం. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, నిజాయితీతో ముందుకు సాగుతున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను చీటింగ్ బడ్జెట్ అనడం పూర్తిగా అర్థంహితం. అభివృద్ధి, సంక్షేమం అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ ను రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుగా ప్రచారం చేయడం సమంజసం కాదు. ఇలాంటి బిఆర్ఎస్ అజ్ఞానులకు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. అదేవిధంగా 1.15కోట్ల కుటుంబాలకు రూపాయలు ఐదు లక్షల జీవిత భీమా కల్పించడం, ఆకలితో బడికి వెళ్లే పిల్లలకు ఉదయం అల్పాహారం అందించడంచీటింగ్ ఎలాఅవుతుందో ప్రతిపక్షాలు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు నిధులు కేటాయించడం మానిబద్ధతకు నిదర్శనం అన్నారు. సన్న వడ్లకు బోనస్ ఉద్యోగులందరికీ 1.2 కోట్ల రూపాయల ఇన్సూరెన్స్, క్యాష్ లెస్ హెల్త్ కార్డు వంటి విప్లవాత్మక నిర్ణయాలు ఈ బడ్జెట్ ప్రత్యేకతలు అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సాంకేతిక అంశాలను అడ్డం పెట్టుకుని లబ్ధిదారులకు మేలు జరగకూడదనే కుట్రతో దగుల్బాజీ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు దుర దృష్టకరం. గత పథకాలకు అదనంగా మరిన్ని సంక్షేమ ఫలాలను జోడిస్తూ, పారదర్శకమైన పాలన అందించడమే మా లక్ష్యం అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దత్తత తీసుకున్న జడ్‌పిహెచ్‌ఎస్ (హరిజనవాడ) పాఠశాలకు మౌలిక వసతులు
- స్నేహ ఫౌండేషన్ తరపున 120 డ్యూయల్ డెస్క్ బెంచీలు అందజేత
- ఏబీడీ సంస్థ నుండి ఒక ఇంటరాక్టివ్ పానల్ బోర్డు, 20 కుర్చీలు వితరణ
- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన పాఠశాల ఉపాధ్యాయ బృందం



స్కూల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి (ఫైల్)



స్నేహ ఫౌండేషన్ ద్వారా అందించిన డ్యూయల్ డెస్క్ బెంచీలు కుర్చీలు

**వనపర్తి, మార్చి 28, ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హరిజనవాడ) వనపర్తి పాఠశాలను గతంలో సందర్శించిన సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూఢి మేఘారెడ్డి పాఠశాలలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పిహెచ్ఎస్ హరిజనవాడ పాఠశాల అభివృద్ధికి తన సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. పాఠశాల విద్యార్థులకు సరిపడ బెంచీలు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకొని స్నేహ ఫౌండేషన్ వారి సహకారంతో 120 డ్యూయల్ డెస్క్ బెంచీలను పాఠశాలకు అందించారు. అంతేగాక ఏబీడీ సంస్థ సహకారంతో ఒక ఇంటరాక్టివ్ ఫ్లిప్ ప్యానెల్ బోర్డు, 20 కుర్చీలను సిఎస్ఆర్ ఫండ్ ద్వారా పాఠశాలకు అందించారు. రాబోయే విద్యాసంవత్సరం నాటికి విద్యార్థుల కోసం మరొక ఇంటరాక్టివ్ ఫ్లిప్ ప్యానెల్ బోర్డును కూడా అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు గాను అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు శిథిలావస్థలో ఉన్న పాత పాఠశాల భవనం స్థానంలో నూతన పాఠశాల భవనం నిర్మాణానికి కూడా తన వంతు సహాయం అందించి త్వరలోనే పూర్తి చేస్తానని ఎమ్మెల్యే మాటిచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. తమ పాఠశాల పై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాల అభివృద్ధికి -మిగతా4లో..

## బాలానగర్‌లో గంజాయి పట్టివేత

**బాలానగర్, మార్చి28 ప్రభాతవార్త:** బాలానగర్ మండలంలోని మోతీ ఘనపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా డ్రగ్స్ నిర్మూలనకై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకుజడ్చర్ల ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బాలానగర్ మండలం మోతి ఘనపూర్ గ్రామ పరిధిలోని నవదుర్గ స్టీల్ కంపెనీ పరిసర ప్రాంతాల్లో బీహార్ రాష్ట్రానికి చెందిన రాజేందర్ గంజాయిని విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుండి 420 గ్రాములఎండు గంజాయి 10గ్రాముల గంజాయి చాక్లెట్స్ స్వాధీనంచేసుకున్నారు. నిందితుడురాజేందర్‌ను విచారించగా బీహార్ రాష్ట్రంలో కేజీ రూ.5వేలకు కొనుగోలు చేసి..ఐదు గ్రాములకు 400 చొప్పున ఇక్కడ విక్రయిస్తున్నానన్నారు. ఒక చాక్లెట్‌రూ.50 చొప్పున విక్రయిస్తున్నాడని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్సై నాగరాజు తెలిపారు.



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**పెండింగ్ కేసులు పరిష్కారం చేసుకోవాలి**
**రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి, ఎన్.వి.శ్రావణ్ కుమార్**
**జిల్లా కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం**




బాధితులకు చెక్ అందజేస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి




**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకుని ఇరుపక్షాలు,పరస్పర సమ్మతి, అంగీకారంతో తమ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీ పి.సామ్ కోషి పిలుపునిచ్చారు.శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్‌కోషి,రాష్ట్రహై కోర్ట్ న్యాయమూర్తి ఎన్.వి.శ్రావణ్‌కుమార్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి మాట్లాడుతూ లోక్ అదాలత్ రెండు పదాల కలయిక అని అంటే ప్రజల న్యాయస్థానం అని పిలువబడుతుందని తెలిపారు. మహబూబ్ నగర్‌లో జాతీయ లోక్ అదాలత్ ను మార్చి 14న నిర్వహించాల్సి ఉండేదని, కాని మార్చి 14,15 తేదీల్లో న్యాయమూర్తుల సమావేశం కారణంగా రెండు వారాలు వాయిదా పడి గురువారం మార్చి 28న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.లోక్ అదాలత్ వ్యవస్థ భారత దేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలలో అత్యంత సమర్థవంత మైనదిగా నిలుస్తోందని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, మోటార్ ప్రమాద క్లెయిమ్ కేసులు, బ్యాంకు రుణాలు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు వంటి అనేక కేసులను లోక్ అదాలత్ ద్వారా వేగంగా పరిష్కరించవచ్చని తెలిపారు.ఈ విధానం ద్వారా పక్షాల మధ్య పరస్పర అంగీ కారంతో వివాదాలను ముగించవచ్చని, దీనివల్ల శాశ్వత పరిష్కారం లభిస్తుం దని అన్నారు.అలాగే, లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులు చట్టబద్ధమైనవని, అవి సివిల్ కోర్టుడిగ్రీకి సమానమని ఆయన వివరించారు. ఒకసారి లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారమైతే, దానిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని, అందువల్ల పక్షాలు ముందుగానే చర్చించి సమ్మతి వ్యక్తం చేయడం అవసరమని సూచించారు. గతంలో సంవత్సరంకు ఒకటి,రెండు సార్లు నిర్వహించినట్లు,ప్రస్తుతం సంవత్సరానికి మూడు నెలలకొక సారి జాతీయ లోక్ అదాలత్ దేశం అంతటా ఒకేసారి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అవుతున్నట్లు,ప్రజలు స్వచ్ఛందంగా తమ వివాదాలు రాజీ మార్గంలో పరిష్కారం కు ముందుకు వస్తు న్నట్లు తెలిపారు. రాజీ, మధ్య వర్తిత్వం ద్వారా తమ వివాదాలు ప్రత్యామ్నాయ విధానంలో పరిష్కారం చేసుకోవచ్చని అన్నారు.గత సంవత్సరం లోక్ అదాలత్‌లో 2200 కేసులు పరిష్కారం జరిగాయని వెల్లడించారు.లోక్ అదాలత్ కేసుల్లో ఇరుపక్షాల్లో ఎవ్వ రూ ఓడినట్లు కాదని,గెలిచినట్లు కాదని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలను సులభంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు వేగవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన న్యాయం అందించడమేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయం అందుబాటులోకి తీసుకురావడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా చిన్నచిన్న వివాదాలు, కుటుంబ కలహాలు, రుణ సమస్యలు వంటి అంశాలను కోర్టువెలుపలే సర్దుబాటు చేసుకోవడం ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు.బలహీన,అణగారిన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయంఅందిస్తున్నట్లు తెలిపారు న్యాయ సేవాధికార సంస్థలు ప్రజల్లోచట్ట అవగాహన పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత మాట్లాడుతూ జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా 2033 కేసులు గుర్తించినట్లు,వీటి పరిష్కా రానికి మహబూబ్‌నగర్‌లో 7బెంచిలు, జడ్చర్లలో రెండు బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్ పంచాక్షరి,జిల్లాన్యాయసేవాధికారసంస్థ కార్యదర్శిఇందిర,బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టుసిబ్బంది,పోలీసు అధికారులుమరియుపెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

**రాష్ట్ర హై కోర్ట్ న్యాయమూర్తులకు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్,జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి...**

జాతీయ లోకా అదాలత్ కార్యక్రమంలో పాల్గొనే నిమిత్తం మహబూబ్ నగర్ కువిచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్‌లకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలు ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద పుష్ప గుచ్ఛం, మొక్క అందచేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.



బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నేతలు

## బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**చిన్న చింతకుంట, మార్చి 28 ప్రభాతవార్త:** మండలంలోని బండర్‌పల్లి గ్రామ సమీపంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అలివేలుమంగ పద్మావతి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. ఏప్రిల్ 2న స్వామి వారికళ్యాణ మహోత్సవం, రాత్రికి రథోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా కొనసాగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. ఎమ్మెల్యే జిఎంఆర్ కు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో మొగిలన్న, డా.జానకిరామ్, తిరుపతయ్య, డిఆర్‌కె బ్రదర్స్ తదితరులు ఉన్నారు.

## అలరించిన నృత్య రూపకం



ప్రశంసా పత్రం అందుకుంటున్న విన్మయ్

**మహబూబ్‌నగర్, మార్చి 28 ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై ఉన్నమక్కువతో, అరుణాచలంలో నృత్య ప్రద ర్శన భారత నాట్యంతో అందరినీ అలరించారు. శనివారం అరుణాచలంలో భారత నాట్య ప్రదర్శన నృత్య ప్రదర్శనను నిర్వహించగా మరికల్ మండలం, రాకొండ గ్రామానికి చెందిన నాగరాజు కుమార్తె విన్మయ్ చేసిన నృత్యం, భరతనాట్యం అందర్నీ అలరించింది. ఈ సంద ర్భంగా నిర్వాహకులు విన్మయ్‌ను అభినందించి, ప్రశంసా పత్రం అందజేశారు.అదేవిధంగా మరికల్ మండల ప్రజలు, యువకులు, ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు వారి తాతగారైన మాజీ సర్పంచ్ నరహరి చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు.

## ఆరోగ్య శిబిరం అభినందనీయం

■ రాజాపూర్ గ్రామ సర్పంచ్ కావలి రామకృష్ణ



శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకుంటున్న సర్పంచ్ కావలి రామకృష్ణ

**రాజాపూర్, మార్చి 28 ప్రభాతవార్త:** రాజాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరఫున ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని రాజాపూర్ గ్రామ సర్పంచ్ సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ కావలి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జనరల్ హాస్పిటల్ సంయుక్తంతో ప్రసూతి, గైనకాలజీ జనరల్ ఫిజీషియన్ చిన్న పిల్లల డాకర్టర్, ఎముకల డాక్టర్,కంటి డాక్టర్ మరియు దంత వైద్యులు ఎక్స్ రే తదితర రక్ష రక్త పరీక్షలు ఈ శిబిరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. శనివారం నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 423 మంది పాలుపంచుకోవడం జరిగిందని శిబిరాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన రాజాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సుస్మితకు ఈ సందర్భంగా సర్పంచ్ కావలి రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల అధికారులు, గ్రామ ఉపసర్పంచ్ రేష్మ నజీమ్ బేగ్, పలువురు వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 7వార్డ్‌లో పారిశుధ్య పనులు పర్యవేక్షించిన కౌన్సిలర్ భరత్

**నారాయణపేట, మార్చి 28 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని వార్డ్ నెంబర్ 7లో గల తాయమ్మ మందిరం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రధాన డ్రైనేజీ కాలువతో పాటు మెయిన్ రోడ్‌పై ఉన్న కల్వర్ట్ వద్ద పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది,పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఈ పనులను వార్డ్ కౌన్సిలర్ భరత్ దగ్గరుండి పర్యవేక్షించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన మున్సిపల్ సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గాయత్రి నగర్, బాబా కాలనీ వాసులు పాల్గొని సహకరించారు.

## జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఎంజెపి విద్యార్థులు



షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**మక్తల్ టౌన్,మార్చి 28 ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా ఇంద్రపాల్ నగర్‌లో ఈ నెల 1 నుండి 3 వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర షూటింగ్ బాల్ పోటీలలో నారాయణపేట జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా బాలురు జట్లు పాల్గొని, పొందిన సర్టిఫికెట్స్ ను ఈ నెల 28న మక్తల్ ఎంజెపి( ఓల్డ్) బాలుర గురుకుల పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం 24 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. అలాగే నారాయణపేట జిల్లా నుండి జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఎం జె పి విద్యార్థి గుంతల రాజేష్ ను,మహబూబ్‌నగర్ జిల్లా నుండి ఎంపికైన డి. బీమ్ (దేవరకద్ర)ను సన్మానించి, అభినందించారు. బి.గోపాలం మాట్లాడుతూ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన బాలురు ఏప్రిల్ 12 నుండి 14 వరకు తెలంగాణ లోని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని బి.గోపాలం తెలిపారు. పాఠశాల వైస్ ప్రిన్సిపల్ నల్లారెడ్డి, పి ఈ టి స్వప్న బి.గోపాలమును, ఎస్పై 2ఆచారిని ఘనంగా సన్మానించి వారు మాట్లాడుతూ గోపాల్ సహకారంతో మా పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి వివిధ క్రీడలలో పాల్గొంటున్నారని, క్రీడలలో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయని క్రీడల వలన ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, మానసిక ఉల్లాసం,సంపూర్ణ ఆరోగ్యం కలుగుతాయని, గోపాల్ సార్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నల్లారెడ్డి, పిఈటి స్వప్న, వార్డెన్ రాఘవాచారి ,గుంతలి శివకుమార్ క్రీడాకారులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రాములోరి కళ్యాణంలో దళిత సర్పంచికి అవమానం

■ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి
■ జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాంగ్ హనుమంతు డిమాండ్

**దామరగిద్ద, మార్చి 28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా అమ్మిరెడ్డిపల్లి గ్రామంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో దళిత మహిళా సర్పంచ్‌కు అవమానం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామ సర్పంచ్ దాసరిలక్ష్మి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో గత 30 ఏళ్లుగా సర్పంచ్‌లు రాములవారి పూజ కార్యక్రమంలో పాల్గొనడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఈసారి కూడా పెద్దల సమక్షంలో సర్పంచ్ లక్ష్మి, అంజప్పలు పూజలో కూర్చోవాలని నిర్ణయించారు. అయితే పూజలో కూర్చున్న అనంతరం, తాము ఎస్సీలు కావడంతో కళ్యాణం నిర్వహించరాదని మాజీ సర్పంచ్ స్వప్న వెంకటరామిరెడ్డి అభ్యంతరంవ్యక్తం చేసి,వారిని అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పినట్లు ఆరోపించారు.దీనితో సర్పంచ్ లక్ష్మి ్మ, అంజప్పలు పూజ స్థలం విడిచిపెట్టాల్సి వచ్చినట్లు తెలిపారు. అనం తరం మాజీ సర్పంచ్ స్వప్న వెంకటరామిరెడ్డి తమ చేతుల మీదుగా కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారని పేర్కొన్నారు.ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, స్వప్న వెంకటరామిరెడ్డిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గ్యాంగ్ హనుమంతు డిమాండ్ చేశారు.

## మారుమూల ప్రాంతాలకు సైతం రైల్వే లైన్ అవకాశం

**బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు**



మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

**వనపర్తి, మార్చి28, ప్రభాతవార్త:** డోర్నకల్ గద్వాల రైల్వే లైన్ ఫైనల్‌లొకేషన్స్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)పూర్తయిన సందర్భంగా వనపర్తి పట్టణ రాజీవ్ చౌరస్తాలలో శనివారం పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ అధ్యక్షతన ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు హాజరై మాట్లాడారు. దశాబ్దాలుగా వనపర్తి జిల్లా ప్రజల చిరకాల వాంఛ ఆయన వనపర్తికి రైల్వేలైన్ మంజూరు పై గతంలో ఉన్న ప్రభుత్వాలు అనేక పర్యాయాలు సర్వే పేరిట మోసం చేయడం జరిగిందని కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మారుమూల ప్రాంతాలకు రైల్వే కనెక్షన్ లేని ప్రాంతాలకు రైల్వేలైన్ కళ సహకారం అవుతుందని నాగర కర్నూల్ పార్లమెంట్ మాజీ సభ్యులు బిజెపి రాష్ట్ర నాయకులు పోతుగంటి రాములు కృషి ఫలితంగా డోర్నకల్ గద్వాల వయా వనపర్తి మీదుగాఫైనల్ లొకేషన్స్ సర్వే పూర్తి చేయడం జరిగిందని తాజాగా పార్లమెంటులో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవి తెలియజేయడం జరిగిందని 296 కిలోమీటర్ల రైల్వే లైను 536 కోట్లతో డోర్నకల్ గద్వాల రైల్వే లైను నిర్మాణం కానున్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం గ్యారేంటి ఇస్తే పూర్తిగా అమలు అయ్యే గ్యారెంటీ అవుతుందని లో సందేహం లేదని పేర్కొన్నారు.పశ్చిమాస్యాలు ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా యుద్ధ ప్రభావంతో ప్రపంచంలో అనేక దేశాలు చమురు పెట్రోల్ డీజిల్ కొరతతో వారాంతపు సెలవులు ఇండస్ట్రీలు వ్యాపార సముదాయాలకు సెలవులు ప్రకటిస్తున్నారని కానీ భారతదేశంలో ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో పెట్రోలు డీజిల్‌పై కస్టమ్ డ్యూటీని ఎత్తివేసి దేశ ప్రజలకు శ్రీరామనవమి గిఫ్ట్ గా ఇవ్వడం జరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ దూరదృష్టి ఫలితంగా గతంలో 16 దేశాలతో చమురు వ్యాపారం నుండి నేడు 46 దేశాల నుండి యుద్ధం జరుగుతున్న భారతదేశానికి చమురు సరఫరా ఆగిపోలేదని రాబోయే రెండు నెలలకు సరిపడా పెట్రోల్ డీజిల్ ఎల్పీజీ నిలువలు మనదగ్గర ఉన్నాయని దీనికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చతురతే కారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు శ్రీనివాస్‌గౌడ్, వారణాసి కల్పన, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కోశాధికారి బండారు కుమార స్వామి కార్యదర్శి జంగం సురేందర్ ఉపాధ్యక్షులు గొర్ల బాబు రావు సీనియర్ నాయకులు కుమార్ విష్ణువర్ధన్ రెడ్డి బచ్చు రాము దాసరాజు ప్రవీణ్ అలివేలమ్మ, సంద వెంకటేష్, మండల రఘు, ఎర్రరవి, కంచరవి, పీఎం రాము, గుంటి శివ, 26 వార్డు కౌన్సిలర్ విజయసాగర్, రాయన్న, బాలపీరు, పట్టణ కార్యదర్శి కడమంచి శివ, అశ్విని, పవన్, చిన్న రాయుడు, కోశాధికారి కూన శ్రీకాంత్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు చాణక్య పాల్గొన్నారు.

## క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

**ఉబ్బడి తండా సర్పంచ్ హరిసింగ్ నాయక్**



క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచ్ హరిసింగ్ నాయక్

**కోయిలకొండ మార్చి28, ప్రభాతవార్త;** క్రీడాకారులు క్రీడారంగంలో గెలుపోవటములను సమానంగా తీసుకోవాలని ఉబ్బడి తండా సర్పంచ్ హరి సింగ్ నాయక్ క్రీడాకారులకు సూచించారు. శనివారం కోయిలకొండ మండలం చింతల్ తండా గ్రామ పంచాయతీలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ కు మండలంలోని ఉబ్బడి తండా సర్పంచ్ హరి సింగ్ నాయక్ తోపాటు మోదీపూరు సర్పంచ్ రాజు నాయక్, చింతల్‌తండా సర్పంచ్ రుక్కమ్మ వెంకట్ నాయక్ లు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసికొల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడాకారులు క్రీడలలో ఓటమి చెందిన అది గెలుపుకు నాందిగా భావించాలన్నారు. యువతను ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో తండా పెద్దలు వెంకటేష్ నాయక్, మురళి, నవీన్, మాజీ సర్పంచ్ రఘునాథ్, మహేందర్, ఎం రమేష్ పాల్గొన్నారు.

## క్వారీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

◆ శ్రీకురుమూర్తి స్వామి ఆలయ పరిరక్షణ సమితి వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిరక్షణ సమితి సభ్యులు

**చిన్న చింతకుంట,మార్చి28 ప్రభాతవార్త:** శ్రీకురుమూర్తి ఆలయ పరిసర ప్రాంతాల్లోని తిప్పగుట్టలో క్వారీకి అనుమతులు ఇవ్వొద్దంటూ భక్తులతో సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారుమాట్లాడుతూ క్వారీ ఏర్పాటు చేయడం వల్ల రాబోయే రోజుల్లో పర్యావరణానికి విఘాతం కలుగుతుందన్నారు. క్వారీలో బ్లాస్టింగ్‌ల వల్ల శ్రీకురుమూర్తిస్వామి పుణ్యక్షేత్రం అదురుతూ ఆలయం దెబ్బతింటుందని ఎట్టి పరిస్థితుల్లో మైనింగ్ క్వారీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వరాదన్నారు. అనుమతులు ఇస్తే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని వారు హెచ్చరించారు. భక్తుల విశ్వాసాలను పరిగణలోకి తీసుకొని ఆయా ప్రభుత్వాలు క్వారీ ఏర్పాటును విరమించుకోవాలని సూచించారు. క్వారీ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ఏడుకొండలలో ఆరు కొండలే మిగులుతాయని భక్తులు ఆందోళన చెందుతున్నారన్నారు. గ్రామ గ్రామాన క్వారీ కివ్యతిరేకంగా సంతకాల సేకరణను పార్టీలకు అతీతంగా చేపడుతమన్నారు. ఈ యొక్క సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ సమితి సభ్యులు నంబిరాజు, కురువ రమేష్,దశరథ్ ,శ్రీకృష్ణ, బాలరాం, ఆకుల అంజన్న, గాండ్ల శేఖర్, శ్రీధర్, మధు, మునెప్ప తదితరులు ఉన్నారు.

## సొంతింటి కలను నెరవేర్చిన ప్రజా ప్రభుత్వం

◆ ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్‌రెడ్డి

**చిన్నచింతకుంట, మార్చి28 ప్రభాతవార్త:** ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చి వారి కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని బండర్‌పల్లి గ్రామంలో రాధమ్మ నరసింహులు ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని ఆమె తెలిపారు.అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు.రాబోయే రోజుల్లో దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతారని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలన్న, డా. జానకిరామ్,తిరుపతయ్య, డిఆర్‌కె బ్రదర్స్ తదితరులు ఉన్నారు.



బండర్‌పల్లిలో ఇందిరమ్మ గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే సతీమణి

## పాలమూర్ సీడ్స్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం

**భూత్పూర్, మార్చి 28, ప్రభాతవార్త:** భూత్పూర్‌కు చెందిన పాలమూరు సీడ్స్ ఆధ్వర్యంలో ఆదివారం టీం విమలాకర్ ఫౌండేషన్ నేతృత్వంలో పట్టణంలోని న్యూ ఎరా హైస్కూల్‌లో ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీడ్స్ అధినేత వల్లపురెడ్డి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో జీర్ణవ్యవస్థ కాన్సర్ పరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్ అబ్‌డామిన్, ఫైబ్రొస్కాన్,యుజీఐ ఎండోస్కోప్ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.వీటితో పాటు సీరమ్ క్రియాటినిన్,హెచ్‌బిఎస్ఏజీ, 2డిఎకో,ఆర్బీఎస్, హెచ్‌సీఐ, ప్రాక్టొస్కోప్,లివర్‌ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఇంటర్నల్ మెడిసిన్ వంటివాటికి నిపుణులైన వైద్యులచే ఉచితంగా కన్సల్టేషన్లుంటాయని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలు,రోగులు తాము సీడ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు.

## అభివృద్ధిపై ప్రజాప్రతినిధులతో కౌన్సిలర్ సత్యరఘుపాల్ భేటీ



ఎంపి డికె అరుణ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డిలను కలిసిన వార్డు కౌన్సిలర్ సత్యరఘుపాల్

**నారాయణపేట, మార్చి 28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా అభివృద్ధి అంశం పైబీజేపీ మొదటి వార్డు కౌన్సిలర్ సత్యరఘుపాల్ ముందడుగు వేశారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణని, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ని కలిసి అభివృద్ధి విషయాలపై చర్చించారు.జిల్లా అభివృద్ధికి తమ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నారాయణపేట పట్టణం,పరిసర ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని తెలిపారు.ముఖ్యంగా రహదారులు పారిశుద్ధ్యం, తాగునీటి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన అభ్యర్థించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు కూడా అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## పోమాల్ ఫింగర్ లీగ్ విజేత పవర్ హీటర్

**బహుమతులు అందజేసిన సర్పంచ్, ఉపసర్పంచ్**



విజేతకు షీల్డ్ అందజేస్తున్న దృశ్యం

**నవాబుపేట, మార్చి28 ప్రభాతవార్త:** ఉగాది పండుగ పురస్కరించుకొని మండల పరిధిలోని గ్రామంలో నిర్వహించిన పిపిఎల్ ప్రీమియర్ లీగ్ నేటితో ముగిసింది. మొదటి విజేతగా పవర్ హీటర్ టీం విజయం పొందగా విజేతగా కోమల్ ఫైటర్స్ టీం నిలిచింది.విజేతలకు మొదటి బహుమతి గుట్టమీద వెంకటేష్ అందించగా రెండవ బహుమతి ఇరగదీన్ల నర్సింలు బ్రదర్స్ షీల్డ్ బహుకరించగా,పోమాల్ గ్రామ ఉపసర్పంచ్ రెండవ బహుమతిని, డిప్యూటీ సర్పంచ్ ఆంజనేయులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మంచాల రాఘవేందర్, మ్యాన్‌ఆఫ్‌ది సిరీస్‌లో గ్రామస్తులు, గ్రామ ప్రజాప్రతినిధులు,సర్పంచ్, యువకులు, క్రీడాకారులు గ్రామస్తుల సమక్షంలో బహుమతులు అందజేయడం జరిగింది.

## వేగ నియంత్రణకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు

**నారాయణపేట, మార్చి 28 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు సురక్షితంగా గమ్యానికి చేరండి మూడో విడత కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో రోడ్డు భద్రత చర్యలు చేపట్టారు.వాహనాల వేగ నియంత్రణ కోసం ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్యతో కలిసి టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు పలు ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశారు. సింగారం చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, ఓల్డ్ బస్టాండ్, సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలలు పేరపళ్ల రూట్‌లలో మొత్తం 19 రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ చర్యలతో రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాహనాల అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని అన్నారు.ముఖ్యంగా పాఠశాలలు, కాలేజీలు,రద్దీ ప్రాంతాల్లో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రంబుల్ స్ట్రిప్స్ వల్ల డ్రైవర్లు ముందుగానే వేగాన్ని తగ్గించుకుంటారని,ఇది ప్రజల ప్రాణాలను రక్షించడంలో సహాయపడుతుందని చెప్పారు.ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని కోరారు. ప్రజల సహకారం లేకుండా రోడ్డు భద్రత సాధ్యం కాదని, అందరూ కలిసి సురక్షితంగా గమ్యానికి చేరండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

## పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

**గద్వాల మార్చి 28, ప్రభాతవార్త:** పదవ తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం గద్వాలలోని విశ్వేశ్వరయ్య, విశ్వభారతి పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు, తదితర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తోనే కేంద్రాలకు తరలించి పరీక్ష అనంతరం జవాబు పత్రాలను స్థానిక తపాలా కార్యాలయంలో డిపాజిట్ చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఆయా పరీక్షా కేంద్రాల్లోని కొన్ని తరగతి గదుల్లో తిరిగి విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ పరీక్షల అధికారి శ్రీనివాసులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం విజయవంతం



మూలమల్లలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ మార్చి 28, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో శనివారం రోజు నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతంగా కొనసాగింది. గ్రామానికి చెందిన దేశాయి సరళారెడ్డి స్మారకార్థం 25వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కాబట్టి అసోసియేషన్ అధ్యక్షురాలు దేశాయి పద్మజారెడ్డి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రక్తపు బొట్టు మనిషి ప్రాణం విలువ కాపాడుతుందని విషయాన్ని గుర్తుంచుకొని రక్తదాన శిబిరానికి యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని సూచించారు. దేశాయి పద్మజా రెడ్డి చేస్తున్నటువంటి సామాజిక సేవా కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా మూలమల్ల గ్రామయువతీ యువకులు నిలవడం అభినందించే దగ్గర విషయమని ఆయన అన్నారు. హైదరాబాదులోని పంజాగుట్ట ప్రాంతానికి చెందిన మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగిన రక్తదాన శిబిరానికి గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరై రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగారెడ్డి గ్రామ ప్రముఖులు భీమన్న మరియు ఆనంద్ గౌడ్ తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నారు.

## 30న మార్కెట్ కాంట్రాక్టుల వేలం

● మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య

**నారాయణపేట, మార్చి 28 ప్రభాతవార్త:** నారాయణపేట పురపాలక సంఘం 2026,27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివిధ కాంట్రాక్టుల కేటాయింపుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్కెట్ ఫీజు, బండి వసూళ్లు, మాంసం వ్యాపారాలు, పశుసంవర్ధక విభాగాలకు సంబంధించిన కాంట్రాక్టులను బహిరంగ వేలం ద్వారా ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు మార్చి 30న మధ్యాహ్నం 3.00 గంటలకు నారాయణపేటలోని మార్కెట్ యార్డ్ థాయ్ బజార్‌లో వేలం నిర్వహించనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా డిమాండ్ డ్రాఫ్ట్ డిడి సమర్పించి వేలంలో పాల్గొనాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 12.00 గంటలలోపు డీడీలు సమర్పించాల్సి ఉంటుంది కాంట్రాక్టులకు సంబంధించి డిపాజిట్ మొత్తాలు కూడా నిర్ణయించగా, మార్కెట్ ఫీజుకు రూ.1 లక్ష, బండి వసూళ్లకు రూ.50వేల, మాంసం వ్యాపారాలకు రూ.1 లక్ష, పశుసంవర్ధక విభాగానికి రూ.50 వేలగా నిర్ణయించారు అర్హులైన వారు మాత్రమే ఈ వేలంలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు నారాయణపేట మున్సిపాలిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు.

## శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక



దేవాలయ కమిటీ పాలకవర్గాన్ని సన్మానం చేస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ మర్చి28, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా ఆలయ ప్రధాన పూజారి శ్రీధర్ జోషి విలేకరులకు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగావెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కొరకు పనిచేస్తున్న నిర్వాహకులతో పాటుగా నూతన కమిటీని ఎన్నుకుని మరింత పురోభివృద్ధి చెందేందుకు దోహద పడుతుంది అని ఆయన అన్నారు. దేవాలయ కమిటీ నూతన అధ్యక్షులుగా అక్కల ఆనంద గౌడ్ ఉపాధ్యక్షులుగా ప్రశాంత్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా సత్యన్నా తదితరులతో పాటుగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం మాట్లాడుతూ గ్రామంలో గల దేవాలయ కమిటీ అభివృద్ధి కోసం తమ వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన పలకవర్గాన్ని గ్రామ ప్రముఖులు తదితరులు పూలమాలలు శాలువాలతో ప్రత్యేకంగా సన్మానం నిర్వహించారు.

## డిగ్రీ కళాశాలలో లైబ్రరీ కోసం ఆర్థిక చేయూత



**వడ్డేపల్లి, మార్చి 28 ప్రభాతవార్త:** శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సంబందించిన పుస్తకాలు తీసుకునేందుకు సగర సంఘం జోగులాంబ గద్వాల్ జిల్లా అధ్యక్షులు తిమ్మప్ప రూ.10 వేలుఆర్థిక సహాయం అందచేశారు. కళాశాల సిబ్బందికి శనివారం నగదును అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం సబ్జెక్ట్ వారిగా ఉన్న పుస్తకాలు మాత్రమే కాకుండా, విజ్ఞానం పెంపొదించుకునే పుస్తకాలు కూడా అవసరమని, వాటిని విద్యార్థులకు అందిం చేందుకు కృషి చేయాలన్నారు. లైబ్రరీలు అంటే వైజ్ఞానిక నిలయాలని వాటి అభ్యున్నతికి పాటు పడాలని అన్నారు.

## బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**నారాయణ పేట, మార్చి 28 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జై భవాని ఫ్రూట్ మర్చంట్స్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని శక్తిపీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద్ పురోహిత్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కౌన్సిలర్లు సత్యమ్మ, మహేష్, ఎలక్ట్రికల్ ఏఈమహేష్, టీఆర్ఎస్ నాయకులు చెన్నారెడ్డిఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవికాలంలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు ప్రజలు ఎక్కువగా నీరు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని ఎండ ప్రభావం నుంచి రక్షణ పొందాలని తెలిపారు.



## నిలకడ లేని విద్యుత్ సరఫరాతో రైతులు అగచాట్లు



**ఉప్పునుంతల, మార్చి 28 ప్రభాతవార్త :** ఉప్పునుంతల మండలంలోనిలకడ లేని విద్యుత్ సరఫరా రైతులు అగచాట్లు పడుతున్నారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ ఎస్‌సిఇ వచ్చిన మండలంలో సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వేసవికాలం కావడంతో మధ్యాహ్న సమయంలో సరఫరా లో నిలిపి వేయడం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోపక్క మండలంలో వ్యవసాయ సాగుకు నిలకడలేని విద్యుత్ సరఫరా అందించడంతో పూర్తిస్థాయిలో పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం రైతాంగానికి 24 గంటల సరఫరాఅందిస్తున్నామని ప్రకటిస్తున్న మండలంలో విద్యుత్ అధికారుల వైఫల్యం తో విద్యుత్ సరఫరా లో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా పట్ల అధికారం ఆరా తీయగా ప్రతిసారి ఏదో కుంటి సాకు సమాధానాలు చెపుతున్న తప్ప నిలకడ లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందించిన దాఖలాలు కనిపించడం లేదు. రైతాంగం పూర్తిగా ఇబ్బంది ఎదుర్కొంటున్న స్థానిక విద్యుత్ అధికారులకు చీమ కుట్టినట్లు లేదనిపిస్తుంది. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ అధికారులు అందిస్తున్న సరఫరా పట్ల ఆరా తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతాంగం కోరుతున్నారు. ఇదే విధంగా నిలకడ లేని విద్యుత్ సరఫరా చేస్తే యాసంగి పంటలు చేతి కి అందే అవకాశం లేకుండా పోతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల విద్యుత్ అధికారులు ఇకనుంచి అంతరాయం లేకుండా అందిస్తామని ప్రకటించారు కానీ ప్రకటన వరకే పరిమితం అవుతుందని స్థానిక విద్యుత్ అధికారుల వైఫల్యమా, ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపించిందా రైతులు ప్రశ్నిస్తున్నారు. మండలకేంద్రమైన ఉప్పునుంతలలో జరుగుతున్న ఉత్సాహాలకు కరెంటు అంతరాయం ఒకఉదాహరణగా చెప్పవచ్చు. ఏదేమైనాప్పటికీ విద్యుత్‌అధికారుల పట్ల కఠినమైన నిర్ణయాలు తీసుకుంటే తప్ప సమస్య పరిష్కారం అయ్యే మార్గం కనిపించడం లేదు.

## ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోటీలు



ఉప తహసీల్దార్ రమేష్ నాయక్‌చే ట్రాక్టర్స్ రివర్స్ పోటీలు ప్రారంభం

**ఉప్పునుంతల, మార్చి28 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచు చింతగాళ్ళ శ్రీనివాసులు, తేరు ఉత్సహ కమిటీ ఆధ్వర్యంలోఘనంగా పోటీలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి కోలాటం పోటీలు నిర్వహించగా, శనివారం ట్రాక్టర్స్ రివర్స్ పోటీలు, బైక్ స్లో పోటిలు, భజన, చిడుతల భజన పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను ఉప్పునుంతల ఉప తహసీల్దార్ రమేష్ నాయక్ చే ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఉపతహసీల్దార్ రమేష్ నాయక్, గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కట్టఅనంతరెడ్డి, మాజీఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, కొత్త పెద్దజంగిరెడ్డి, సూరంనారాయణరెడ్డి, తిప్పర్తి జగన్మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి ఋషి రెడ్డి, కట్ట అశోక్ రెడ్డి, శ్రీ ఉమామహేశ్వర దేవస్థానకమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, కొత్త అచ్యుతా రెడ్డి, సూరం ప్రశాంత్‌రెడ్డి (బిట్టు), మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, జిపిఓ లు ఆంజనేయులు, రమేష్, యువజన సంఘం సభ్యులు, ఉత్సాహ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

**పద్మావతి ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో అన్నదానం:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రెండో రోజైనా శని వారం గ్రామ సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథోత్సవం, వివిధ రకాల పోటీలను తిలకించేందుకు హాజరైన భక్తులు, ప్రజలు, గ్రామస్తులకు పద్మావతి ఇండస్ట్రీస్ ప్రొఫెటర్ ఎల్ల నరేష్ యాదవ్ లత్తిపూర్ సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్ల నరేష్ యాదవ్ కుటుంబ సభ్యులు, పెద్దాపూర్ ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, ఉత్సాహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతులు ప్రదానం:** శనివారం నిర్వహించిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండా ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉత్సావ కమిటీ ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్‌కు సన్మానం.... ఇటీవల ఉప్పునుంతల ఉప తహసీల్దార్‌గా రమేష్‌నాయక్ బాధ్యతలు స్వీకరించిన వెను వెంటనే మండల కేంద్రంలో ఉత్సవాలు ప్రారంభం కావడం, ఉత్సాహాల్లో నిర్వహిస్తున్న పోటీలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా హాజరు కావడంతో ఉత్సహ కమిటీ వారు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## ఘనంగా రథోత్సవం



ఉప్పునుంతలలో ఘనంగా రథోత్సవం

**ఉప్పునుంతల, మార్చి 28 ప్రభాతవార్త :** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని మండలకేంద్రమైన ఉప్పునుంతలలో శ్రీ కేదారేశ్వర, చెన్నకేశవ, తేరు ఉత్సావ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వేకువజామున రథోత్సవం ఘనంగా జరిగింది. విశేష జన సమూహం మధ్య, చిటికెల భజనతో పాటుమహిళలు బతుకమ్మ సంబరాల మధ్య రథోత్సవం (తేరు) శివాలయం నుంచి పోచమ్మ చౌరస్తా వరకు రథోత్సవం యాత్ర కొనసాగింది. అంతకు ముందు తేరు ముందు ఆలయ ప్రాంగణంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా రథోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారీ జన సమూహం మధ్య కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, తేరు ఉత్సాహ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచు చింతగాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, గ్రామ పెద్దలు తిప్పర్తి రుక్మారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, కొత్త పెద్ద జంగి రెడ్డి, సూరం నారాయణరెడ్డి, పాపి శెట్టి కుమారస్వామి, తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి ఋషి రెడ్డి, సూరం వెంకట్‌రెడ్డి, కర్నాటి సత్యం, కట్ట అశోక్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కట్ట నారాయణరెడ్డి, శ్రీఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, బొల్లె బాలయ్య, అంతటి శేఖర్ గౌడ్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మెడమోని భాస్కర్, మట్టి తిరుపతయ్య గౌడ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉప్పునుంతల ఆలయంలో ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక పూజలు

**భారీ పోలీసు బందోబస్తు :** శనివారం జరిగిన రథోత్సవ కార్యక్రమానికి ఎలాంటి సంఘటన చోటుచేసుకోకుండా ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. పలు వేషధారణతో రథోత్సవం సందర్భంగా భజన పరులు, చిటికెల భజన కార్యక్రమం జరిగిన పలువురు పలు వేషధారణతో రథోత్సవ కార్యక్రమానికి హాజరు కావడంతో పలువురిని ఆకర్షించింది. వేషధారణతో పాల్గొని రథోత్సవ కార్యక్రమంలో యువకులు, యువజన సంఘం సభ్యులు చేసిన కార్యక్రమంలో పాల్గొని పలువురిని ఆకర్షించింది.

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

రహదారి అధికారులకు సూచించిన సర్పంచ్ రామకృష్ణ





రాజాపూర్ మండల కేంద్రంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**రాజాపూర్, మార్చి28 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల కేంద్రంలో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నందున మండల వాసులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతూ క్షతగాత్రులుగా మారుతున్నారని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుపై వేగా నియంత్రికలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని శుక్రవారం రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ జాతీయ రహదారి అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో శనివారం జాతీయ రహదారి అధికారులు, సిబ్బంది స్పందించి వాహనాల వేగం తగ్గేందుకు పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. మరి కొన్ని ప్రాంతాల్లో వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ రామకృష్ణ వారికి సూచించారు. త్వరలో ప్రమా దాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపడతామని జాతీయ రహదారి అధికారులు, సిబ్బంది తెలియజేశారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**నారాయణపేట, మార్చి 28 ప్రభాతవార్త :** ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ నిపుణులు సూచించారు నారాయణ పేట జిల్లా ఉట్కూర్ మండలలో వికలాంగుల సమాఖ్య కార్యాలయంలో న్యాయ అధికార సేవ సంస్థ, పేట ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించిందని, ఎవరూ ఎక్కువ కాదు తక్కువ కాదని పేర్కొన్నారు. ఎవరైనా వివక్ష చూపితే చట్టపరంగా శిక్షించబడతారని తెలిపారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తయ్యాకే వివాహం జరగాలని, మైనర్‌వివాహాలను ప్రోత్సహిస్తేచట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు పిల్లలకు సంబంధించిన సమస్యలపై 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు, అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని సూచించారు న్యాయ సలహాలు అవసరమైతే 15100 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా పరాలీగల్ వాలంటీర్ కె. నారాయణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కారోబార్ కనకప్ప, ఏపీఎం వనిత కుమారి, మండల వికలాంగులసమాఖ్య సీసీ నర్సింగమ్మ, బిజ్వార్ నర్సింగమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై పోక్సో, అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలి

● ప్రజా సంఘాల డిమాండ్



జిల్లా ఎస్పీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**నారాయణపేట, మార్చి28 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లాలోని మద్దూరు మండలం మోమిన్‌పూర్ జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో జరిగిన ఘటనపై ఉపాధ్యాయుడు గురునాథ్ రెడ్డిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. పదవ తరగతి విద్యార్థినిపై మరో ఉపాధ్యాయుడు స్వామి అసభ్యంగా ప్రవర్తించిన ఘటనను సీసీ కెమెరాలో రికార్డు చేసి, ఆ వీడియోలో బాలిక ముఖాన్ని బ్లర్ చేయకుండా అదేపాఠశాలలోని విద్యార్థులకు, సోషల్ మీడియాలో వైరల్ చేయడం ద్వారా ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడంతో పాటు భవిష్యత్తును దెబ్బతీసేలా వ్యవహరించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో భాగంగా పనిచేస్తున్న గురునాథ్ రెడ్డిపై కూడా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, మానవ హక్కుల కార్యకర్తమద్దిలేటి, నాయకులు తల్వార్ నరేష్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కింద కేసు నమోదు చేయాలి

- బాధిత బాలికకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**దామరగిద్ద, మార్చి 28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండలం మోమినాపూర్ పాఠశాలలో మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని భారత విద్యార్థి ఫెడరేషన్‌ఎస్ఎఫ్ఐడిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మహేష్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ గురువు అనే గౌరవప్రదమైన స్థానంలో ఉండి ఇలాంటి దారుణానికి పాల్పడటం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు. బాధిత బాలికకు న్యాయం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బాధితురాలి గౌరవా నికి భంగం కలిగించేలా వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ వీడియోనుఅన్ని వేదికలనుండి తొలగించేలా సైబర్ క్రైమ్ పోలీసులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బాధిత బాలికకు, ఆమె కుటుంబానికి ప్రభుత్వంపూర్తి రక్షణతో పాటు అవసరమైన మానసిక సహాయాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.

## ప్రమాదవశాత్తు మిద్దె పైనుండి జారిపడి మహిళ మృతి

**ఖిల్లాగణపురం మార్చి 28, ప్రభాతవార్త;** ప్రమాదవశాత్తు మిద్దె పై నుండి జారీ మహిళా మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన గంగారపు వెంకటమ్మ (63సం.) శనివారం తెల్లవారుజామున 3 గంటల 30 నిమిషాల ప్రాంతంలో మండల కేంద్రంలో వర్షపు చినుకులు పడుతూ ఉండటంతో మిద్దె పైన ఉన్న ఉల్లి విత్తనములు నాని పాడవుతాయని నిచ్చెన వేసుకుని మిద్దె పైకి ఎక్కుతుండగా రేకులపై పడిన వర్షపు చినుకులకు కాలు జారీ ప్రమాదవశాత్తు కింద పడింది. తలకు బలమైన గాయం తగలడంతో భర్త రామ్ రెడ్డి, కుమారుడుమల్లేష్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహబూబ్నగర్ లోని జిల్లా ప్రభుత్వఆసుపత్రికి తరలించిచికిత్సలు నిర్వహిస్తుండగా మరణించినట్లు భర్త రామ్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**నారాయణ, పేట మార్చి28 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నారాయణపేట దామరగిద్ద, ధన్వాడమండలాలకు చెందిన లబ్ధిదారులకు ఈ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహాయం అవసరమైన కుటుంబాలకు ఎంతో ఉపయుక్తమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక పెద్ద ఆదరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులుఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కోట్ల రవీందర్ రెడ్డి, సర్పంచులు, కౌన్సిలర్లు వెంకటేష్‌గౌడ్, రవితేజ, రాజ్ ఫూట్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

**నారాయణపేట, మార్చి 28 ప్రభాతవార్త :** సమాజంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గీత మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. పేట మండల కేంద్రంలోని కొల్లంపల్లి గ్రామపంచాయతి కార్యాలయంలో ఆదివారంఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఈ శిబిరం జరుగుతుందని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. గీత తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీ వైద్యం, జనరల్ సర్జరీ, కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధులు, అలాగే కీళ్ళు, ఎముకల సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలుఅందించనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు.



ఆధునిక సాగు పద్ధతులపై పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, శాస్త్రవేత్తలు

## ఆధునిక సాగు పద్ధతులు లాభదాయకం

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాకు 51 వేల రూపాయలు ఆయిల్ ఫామ్ మొక్కలు, డ్రిప్, మెయింటెనెన్స్ ఖర్చు, ఫామ్ పౌండ్స్ ఇలా రకరకాలుగా ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. రైతులు క్రమంగా మూడు సంవత్సరాలు ఆయిల్ ఫామ్ సాగు చేస్తే నాలుగో సంవత్సరం నుంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ మూడుసంవత్సరాల్లో కూడా మొక్క వేళ్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర్ పంటలు వేసుకునే అవకాశం ఉందన్నారు. మూడు సంవత్సరాల తర్వాత కూడాఇతరఅంతర్ పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. కిసాన్ మేళాలో ఏర్పాటుచేసిన వివిధ రకాల వ్యవసాయ ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో పాలెం వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ సుహాసిని, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శైల, డాక్టర్ ఆదిశంకర్, జిల్లా హార్టికల్చర్ అధికారి వెంకటేశం, వ్యవసాయ అధికారి పూర్ణచంద్రారెడ్డి, హార్టికల్చర్ అధికారులు జగన్, లక్ష్మణ్, సర్పంచ్ బోనాసి రామకృష్ణ, ఇతర అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

**జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి..**

## లక్ష్య ఛేదనకు నిరంతర సాధన చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వైద్యులు కలెక్టర్ కు తెలిపారు. మొత్తానికి పాఠశాలలో అన్ని బాగున్నాయని, పాఠశాలలో మరుగు దొడ్లు శుభ్రంగా ఉన్నాయని, ఆవరణ, వంటగది, తరగతి గదులు పరిశుభ్రంగా ఉన్నాయని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం



పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

**నారాయణపేట, మార్చి28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. నారాయణపేట మండలంలోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో పరీక్షల నిర్వహణ విధానాన్ని ఆయన పరిశీలించారు కొంతమంది విద్యార్థులు వాచ్‌లు ధరించి పరీక్షా కేంద్రాలకు వస్తున్నారని తెలిసిందని పేర్కొన్న ఆయన, వాచ్‌లు సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. సెంటర్ సూపరింటెండెంట్లు డిపార్ట్మెంట్ అధికారులు ఇన్విజిలేటర్లు కూడా సెల్ ఫోన్లు కేంద్రాల్లోకి తీసుకురావద్దని ఆయన ఆదేశించారు. పోలీసులు పరీక్షా కేంద్రాల వెలుపలే బందోబస్తు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆ రోజు జరిగిన పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్యపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాలాజీ, సీఎస్‌డీవో పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

గాను ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హరిజనవాడ) వనపర్తి ప్రధానోపాధ్యాయులు ఎస్.చంద్రశేఖర్ పిఎపిసి చైర్మన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాఠశాల శ్రేయోభిలాషులు కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులపై ఆయన ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాలకు బెంచీలు ఇంటరాక్టివ్ బోర్డు నూతన పాఠశాల భవన నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించి ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తారని మాట ఇచ్చినందుకు 18వ వార్డు ప్రజలు, ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంగన్వాడిలలో చిన్నారులకు తొలిముద్ద ప్రారంభం

**దేవరకద్ర, మార్చి 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అంగన్‌వాడీ చిన్నారులకు బ్రేక్ ఫాస్ట్ స్కీంను తొలిముద్ద అసెంబ్లీ ప్రాంగణంలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ పథకం ద్వారా పిల్లలకు రెడీ టు కుక్ ఫుడ్‌ను బ్రేక్ ఫాస్ట్‌గాఅందించనున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరేళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందని, పౌష్టికాహారం లేకపోవడం వల్లే అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.

## బీచుపల్లి పుష్కర్ ఘాట్ టోల్‌గేట్ బహిరంగ వేలం పాట

**ఎర్రవల్లి మార్చి 28, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం బీచుపల్లి గ్రామపంచాయతీలో నీ కృష్ణా నదిపుష్కర ఘాట్ టోల్గేట్ బహిరంగ వేలంపాట ఎం.పీ. ఓ సునీల్ , పంచాయతీ సెక్రటరీ అరుణ గ్రామ సర్పంచ్ విజిత బిసి రెడ్డి, ఉపసర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించగా 32మంది సభ్యులు 50వేల రూపాయలు డిపాజిట్ చేసి పాల్గొనడం జరిగింది. ఇందులో వేలంపాట హెచ్చు తగ్గులు పాడగా అత్యధిక పాట 9 లక్షల పదివేల రూపాయలు ఆర్.ఎం.పి గోపాల్ పాట దక్కించుకోవడం జరిగింది. పాట దక్కించుకున్న వారు నిబంధనలకు విరుద్ధంగా టోలు వసూలు చేయకూడదని ఒకవేళ అలా చేసిన రద్దు చేయబడుతుందని అధికారులు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు వార్డుమెంబర్లు వీరారెడ్డి, శేషన్న చిన్న ఎల్లారెడ్డి, చిన్న నరసింహులు, రఘు చౌదరి, తదితరులు పాల్గొనడం జరిగింది.

## కర్ణాటకకు బయలు దేరిన పియూ జట్టు

**మహబూబ్‌నగర్, మార్చి 28 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీ తరపున పాల్గొనే ఖోఖో స్త్రీల జట్టు శనివారం సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొనేందుకు దావంగేరే యూనివర్సిటీ కర్ణాటకకు బయలుదేరింది. అందుకు గాను ఎంపికైన క్రీడాకారులు పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జీఎన్ శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రిజిస్ట్రర్ ప్రొ॥ పూస రమేష్‌బాబు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లోపాల్గొని మంచిప్రతిభ కనబరిచి పాలమూరు యూనివర్సిటీకి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం క్రీడాకారులకు ట్రాక్ షూ, టీం యూనిఫామ్‌లనుఅందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31.03.26 నుండి 04.04.26 వరకు దేవేంగిరి యూనివర్సిటీ దేవేంగిరి, కర్ణాటకలో నిర్వహించేటటువంటి సౌత్ జోన్ ఇంటర్‌యూనివర్సిటీటోర్నమెంట్లో పాల్గొంటుందని పాలమూరు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా.వై.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విజయలక్ష్మి, కోచ్ శ్రీనివాస్ క్రీడాకారులు పాల్గొన్నారు.



# శ్రీగురులోక్ మాసంధ్ ప్రభు బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

**◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**మద్దూరు, మార్చి 28 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లిలో వచ్చే నెల ఏప్రిల్ 1 నుంచి 4 వరకు జరిగే శ్రీగురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజీ) జాతర బ్రహ్మోత్సవాలకు అధికారులు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారంతిమ్మారెడ్డిపల్లి గ్రామంలో గల బావోజీ ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణింద్ర రెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కలెక్టర్, కడ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ ఆలయంలో (బావోజీ ) గురు లోక్ మాసంద్ ప్రభుకు ప్రత్యేక పూజలు చేశారు. పక్కనే ఉన్న కాళి మాత ఆలయంలోనూ పూజలు నిర్వహించారు. జాతర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగాప్రతి శాఖకు సంబంధించినఅధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణకు ఆర్డీవో రామచందర్ నాయక్ ప్రత్యేక అధికారిగా పర్యవేక్షణ చేస్తారని ఆయన తెలిపారు. దేవాదాయ శాఖ పరంగా ఏంఏర్పాట్లు చేశారని కలెక్టర్ ప్రశ్నించగా రథానికి కలర్స్ వేయిస్తున్నామని, మిగతా జాతర ఏర్పాట్లు చేస్తున్నామని, జాతర కోసం తమ శాఖ నుంచి మొత్తం 12 మంది ఉద్యోగులు సిబ్బందిని డిప్యూట్ చేసినట్లు, గతేడాది మాదిరిగానే ఈ సారి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి కలెక్టర్ కు తెలిపారు. మిషన్ భగీరథ పరంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కల్పించామని, అలాగే భక్తుల కోసం 75 మరుగు దొడ్లు, స్నానపు గదులను ఏర్పాటు చేసినట్లు మిషన్ భగీరథ ఈఈ రంగారావు తెలిపారు. శానిటేషన్ పరంగా దాదాపు 480 మందితో 12 క్లస్టర్ గా తాగునీటి, పారిశుద్ధ్య పనులు చేస్తారని, మూడు సిఫ్టులలో వంద మంది చొప్పున 17 ట్రాలీలతో కార్మికుల సేవలు అందుబాటులో ఉంటాయని డీపీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. జాతర నాలుగు రోజులు తిమ్మారెడ్డి పల్లి లో సెల్ ఫోన్ లకు సిగ్నల్స్ ఉండవని, తమకు పోలీసు శాఖ నుంచి వాకీ టాకీ లు ఇస్తారని తెలపగా, స్పందించిన కలెక్టర్ ప్రతీక్ జైన్ జియో, ఎయిర్ టెయిల్ ఏజెన్సీ వాళ్ళతో మాట్లాడి జాతర జాతరలో నెట్ వర్క్ ఎక్కువ ఉండేలా చూడాలని ఆర్డీవో రామచందర్ నాయక్‌కు సూచించారు. ఒక డాక్టర్, సూపర్ వైజర్ , ఏఎన్ఎం, ఆశాలతో మూడు సిఫ్టులలో గతేడాది ఒక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఈసారి రెండువైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని, అలాగే రెండు మొబైల్ యూనిట్స్ వైద్య సేవలు అందిస్తారని వైద్య శాఖ ప్రోగ్రామ్ అధికారి కలెక్టర్ కు తెలుపగా, వీలైనంత ఎక్కువ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అయితే మందులను నిల్వ చేసేందుకు తమకు ఆలయ ప్రాంగణంలో ఒకగదిని కేటాయించాలని ప్రోగ్రామ్ అధికారి కోరగా వారికి ఒక గదిని కేటాయించాలని కలెక్టర్ దేవాదాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఆలాగే పాము కాటు మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. జాతరలో ముఖ్యంగా పార్కింగ్ ఏర్పాట్లు చాలా అవసరం అని, జాతరలో పిక్ పాకెటింగ్ జరగకుండా పోలీసులు నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఇక విద్యుత్ శాఖ పరంగా 50 లక్షలతో ప్రత్యేకంగా జాతర కోసం ఫీడర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ ఎస్.ఈ నవీన్ కుమార్ తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల కోసం కోస్గి, నారాయణ పేట ఆర్టీసీ డిపో ల నుంచి 8 బస్సులను నడిపిస్తామని, జాతరలో తమకు రెండు చోట్ల పార్కింగ్ స్థలాలను కేటాయించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. బస్ పార్కింగ్ ప్రాంతాల్లోనూ మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డీఎం కోరగా మొబైల్ టాయిలెట్స్ ను ఏర్పాటు చేస్తామని డిపివో సుధాకర్ రెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖ పరంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఫైర్ అధికారి చెప్పారు. జాతరకు పటిష్టబందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సైదులు తెలిపారు. ముఖ్యంగా జాతరలో దొంగతనాలు, ఈవ్ టీజింగ్ జరగకుండా మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. తిమ్మారెడ్డి పల్లి సర్పంచి జ్ఞానేశ్వర్ ఒడ్డి మాట్లాడుతూ..జాతర ముగిసిన తర్వాత ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతమంతా వ్యర్థాలతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని, జాతర ముగిసిన తర్వాత కూడా అంతా శుభ్రం చేయించాలని కోరగా డిపివో సానుకూలంగా స్పందించారు. చివరగా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ గతేడాది ఎలా ఏర్పాట్లు చేశారో ఈ సారి అలాగే చేయాలని, గతేడాది జాతర ఉత్సవాలలో జరిగిన లోటు పాట్లను దృష్టిలో ఉంచుకొని ఈ సారి అలా జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సారి జాతర ఉత్సవాలకు తాను కొత్తగా వచ్చాననీ, కానీ ఇక్కడున్న అధికారులంతా చాలా సీనియర్లు అని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర జరిగే ప్రాంతం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గం పరిధి అని, ప్రోటోకాల్ విషయంలో చాలా జాగ్రత్తవహించాలని ఎవరు పడితే వారిని అనుమతించవద్దని ఆయన పోలీసులకు సూచించారు. ప్రోటోకాల్ పరంగా ముఖ్యమైన వాళ్లు వచ్చినప్పుడు వాళ్ళ దర్శనం విషయంలో భక్తులు అసౌకర్యానికి గురి కావద్దని సంయమనంపాటించాలని కోరారు. ఇక జాతర జరిగే ప్రాంగణంలో ఎలా పడితే అలాదుకాణాలు ఏర్పాటు చేయ కుండా విశాలమైన రహదారికి స్థలాన్ని వదిలి దుకాణాలు ఏర్పాటు చేయిం చాలని, రహదారి మార్కింగ్ హద్దు దాటి ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేస్తే వెంటనే వాటిని తొలగింప చేయించాలని పోలీసుఅధికారి సైదులును ఆయన ఆదేశించారు. అన్నింటి కంటే జాతరలో పారిశుద్ధం ముఖ్యమని, ఆరోగ్యంతో జాతరకు వచ్చిన భక్తులు అనారోగ్యంతో తిరిగి వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత అధికారులందరిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలోడిఆర్డిఏ మొగులప్ప, పీఆర్ఈఈ అశోక్, తహసిల్దార్ జయరాములు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నీటి కష్టాలకు చెక్

- ◆ రూ. 220కోట్లతో ప్రణాళికలు
- ◆ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకారం
- ◆ ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన



ట్యాంకుల నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి28, ప్రభాతవార్త:** మహబూబ్ నగర్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. తాగునీటి ఇబ్బందులు తొలగించాలని లక్ష్యంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో రూ.220 కోట్ల వ్యయంతో భారీ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చుతోంది. నగరాభివృద్ధిలో కీలక మలుపు తీసుకురాబోయే ఈ ప్రణాళిక భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా మొత్తం 1860 కిలో లీటర్ల సామర్థ్యంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో 14 నూతన వాటర్‌ట్యాంకులను నిర్మించనున్నారు. ఈ ట్యాంకులు నిర్మాణం పూర్తయ్యాక నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరిగి, నగర ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. ఇందులో భాగంగా నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్వయంగా స్థల పరిశీలన నిర్వహించారు. ప్రగతి నగర్‌లో 18 లక్షల లీటర్లు, పద్మావతి కాలనీలో 15 లక్షల లీటర్లు, సాంబశివుడు దేవాలయం కొండపై 20లక్షల లీటర్లు, తిరుమల హిల్స్‌లో 5లక్షల లీటర్ల సామర్థంతో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోని ఈ14వాటర్ ట్యాంకులు ఏర్పాటు పూర్తయ్యాక మహబూబ్ నగర్ ప్రజలకు ఇకపై తాగునీటి కొరత ఉండదని, ప్రతి ఇంటికీ సమృద్ధిగా నీరు అందేలా శాశ్వత పరిష్కారం సిద్ధమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటి సమస్యలను పూర్తిగా తొలగించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే ఈ పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం త్వరలోనే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పనులు ప్రారంభమైన తర్వాత వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు తక్షణ ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు రమేష్‌రెడ్డి, రఘు, కిషన్ నాయక్, జ్యోతి, రామస్వామి నాయకులు, లీడర్ రఘు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ ప్రజా ప్రతినిధులకు ఘన సన్మానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల, హాజరైన మాదిగ కుల సంఘ నాయకులు

**వనపర్తి, మార్చి 28 ప్రభాతవార్త :** మాదిగల ఐక్య వేదిక వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాదిగ కులానికి చెందిన ప్రజా ప్రతినిధులకు సన్మానకార్యక్రమం దాచలక్ష్మయ్య కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. కదిరే కృష్ణ, మాజీ మంత్రి డా. మోత్కుపల్లి నర్సిములు డా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అడిషనల్ డీజీపీ విఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ప్రజలకు సేవ చేస్తున్న ప్రజా ప్రతినిధులను గౌరవించడం సమాజానికి గౌరవాన్ని తీసుకువస్తుందని నాయకులు తెలిపారు. డా.కదిరే కృష్ణ మాట్లాడుతూ సమాజంలో చదువుతోనే ఏదైనా సాధ్యం అవుతుంది అని ప్రతి ఒక్కరు చదువుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. గెలుపొందిన సర్పంచ్‌లు ఆత్మ గౌర వంతో సుపరిపాలన అందించాలని వారి పదవి కాలం పూర్తిగాసమస్యల పరిష్కారం కోసం శ్రమిస్తూ అభివృద్ధి చేయాలని సూచించారు. మిగతా వక్తలు మాదిగలు ఐక్యతతో ముందుకు సాగాలని భవిష్యత్ రాజకీయ చైతన్యం కోసం ప్రతి ఒక్కరు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు, సామాజిక కార్యకర్తలు, మాదిగల ఐక్య వేదిక సభ్యులు పెద్దింటి వెంకటేష్, గంధం పరంజ్యోతి, మందరాములు, మీసాలరాము, చిట్యాల తిరుపతి, వడ్డేమాన్ రవి, చిట్యాలసురేష్, దొడ్లరాములు, వెలటూర్ మహేష్, ముప్పురి పురుషోత్తం, దొడ్ల రాములు, బోర్లభీమన్న, ఎద్దుల సాయినాథ్, దారపోగు నాగరాజు, రాజ నగరం రాజేష్, గంధం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల నెరవేర్చిన ప్రజా ప్రభుత్వం

**● ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై..**
**నూతన వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే సతీమణి కవిత**



గృహ ప్రవేశంలో నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

**అడ్డాకుల, మార్చి 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు ఇల్లు లేని సొంతింటి కల ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత అన్నారు. శనివారం నాడు మండల కేంద్రంలో, కందూర్ అనుబంధ గ్రామం గౌరీ దేవిపల్లి, కందూరు వర్నె గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశానికి హాజరై ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులనూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసి పేదల సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సతీమణి కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తోట శ్రీహరి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగుల విజయ మోహన్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, సర్పంచ్ బి.దశరథ రెడ్డి, వేగనాథ్, బి. శేఖర్ రెడ్డి, సతీష్, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**భూత్పూర్, మార్చి28, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్మితమైన శ్రీకాంత్‌రెడ్డికి చెందిన ఇందిరమ్మ ఇంటిని శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్, పోతులమడుగు సర్పంచి ఆనంద్‌రెడ్డి, హస్నాపూర్ సర్పంచి సంజీవరెడ్డిలతో పాటు కాంగ్రెస్ నాయకులు అశోక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తమన్నగౌడ్ పాల్గొన్నారు.

**అమిస్తాపూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత...** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లోని ఆరో వార్డు కోడుగంటి అరుణకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) సతీమణి కవితా మధుసూధన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటితో పాటు కాంగ్రెస్ నాయకులు కెంద్యాల మశ్చందర్, మట్టి ఆనంద్, కెంద్యాల నరేందర్, కెంద్యాల రాజేష్‌కుమార్, పవన్‌కుమార్, కోరెపనన్.శ్రీదేవి, డోకూర్‌శంకర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

**దేవరకద్ర, మార్చి 28 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి, హజిలాపూర్, గద్దెగూడెం, గ్రామాలలో శనివారం దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, తమ సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జిఎంఆర్‌కి వారు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరంఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున (కొత్త బట్టలు పెట్టిన) నూతన వస్త్రాలు జిఎంఆర్ సతీమణి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, వెంకటాయపల్లి సర్పంచ్ సక్కరి రామాంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్‌రెడ్డి, గద్దెగూడెం పూర్ణిత, జాఫర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి



మహిళలు కోలాటాలు వేస్తున్న దృశ్యం

## కన్నుల పండుగగా శ్రీరామ రథయాత్ర

**ఆకట్టుకున్న మహిళల కోలాటాలు, నృత్యాలు**

**జడ్చర్ల, మార్చి 28 ప్రభాతవార్త :** జడ్చర్లలోని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి చేపట్టిన్న శ్రీరామ రథయాత్ర అత్యంత వైభవంగా కొనసాగుతున్నది. శనివారం పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయం నుంచి క్లబ్ రోడ్ మీదుగా పద్మావతి కాలనీ నుంచి బంగారు మైసమ్మ ఆలయం వరకు రథయాత్ర సాగింది. దారి పొడవునా మహిళలు పెద్ద ఎత్తున యాత్రలో పాల్గొని నృత్యాలు చేశారు. పద్మావతి కాలనీలో మహిళలు పెద్ద ఎత్తున రథయాత్ర వద్దకు చేరుకొని శ్రీరాముని పాటలకు కోలాటాలు వేస్తూ భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పట్టణ అధ్యక్షుడు ముచర్ల శ్రీకాంత్, నాయకులు జగ్పాల్ రెడ్డి, బాదేపల్లి రంజిత్ బాబు, దాచేపల్లి చంద్రయ్య, శ్రీశైలం యాదవ్, పట్వోళ్ల నాగిరెడ్డి, బోయ కృష్ణయ్య, సునీత్ కుమార్, అంజిబాబు, 24వ వార్డ్ కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి, బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీ రెడ్డి, యువత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థినికి న్యాయం చేయాలి

**మద్దూరు, మార్చి 28 ప్రభాతవార్త :** మద్దూరు మండల పరిధిలోని మోమీనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి బాలిక అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయిని ఉద్యోగం నుండి తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి తెలియజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయిని పై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే ఈ అంశంలో పాల్గొన్న రాజకీయ నేతలను కూడా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు అధికం కావడం జరిగిందని హెచ్చరించారు. విద్యార్థినికి అధికారులు న్యాయం చేయాలని లేనియెడల ప్రతిపక్ష పార్టీగా ధర్నాలు, రాస్తారోకోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష కౌన్సిలర్లకు, సర్పంచులకు కూడా అధికార పార్టీ నాయకులు మాటలు విని వివిధ శాఖ అధికారులు పనులు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలోపార్టీ సీనియర్ నేతలు శివ కుమార్, అంజయ్య, జగదీశ్వర్, బసప్ప, దినేష్, విఠల్, వివిధ గ్రామాల సర్పంచులు మైపాల్, కౌన్సిలర్లు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**భూత్పూర్, మార్చి 28, ప్రభాతవార్త :** ఆరు రోజుల క్రితం తన తమ్ముడైన కొత్తూర్ బోయిని అంజనేయులు(57) అత్తగారింటిలో ఈ నెల 23న మృతి చెందాడని, ఈ మృతిపట్ల పలు అనుమానాలున్నాయని, తన తమ్ముడుమృతికి కారకులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరుడు బోయిని లక్ష్మయ్య శనివారం భూత్పూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. తన తమ్ముడికి వెల్కిచర్ల గ్రామానికి చెందిన అరుణ(మొగిలమ్మ) తో 30ఏళ్ల క్రితం వివాహమైందని, వీరికి ఓ కూతురు శిరీష ఉండగా, ఆమెను పెళ్లి చేసి పంపారని, కాగా వెల్కిచర్లలో ఇద్దరు భార్యాభర్తలు (అంజనేయులు–అరుణ) మాత్రమే ఉండేవారని, వీరు తరచూ గొడవ పడుతుండేవారని, తన తమ్ముడు తన భార్య గొడవ పడుతుందని కొత్తూరు వచ్చి తమకు చెబుతుండేవాడని, తాము సర్దిచెప్పి తిరిగి పంపామని, పక్షం రోజుల క్రితం తన తమ్ముడి భార్య అరుణ(మొగిలమ్మ) తన తమ్ముడు అంజనేయులుకు పాము కరిచి మృతి చెందాడని ఫోన్ ద్వారా సమాచారమివ్వగా, తాము వెంటనే వెల్కిచర్లకు వెళ్లి చూడగా, మృతుడైన తన తమ్ముడి శరీరంపై గాయాలున్నట్లు గమనించామని, పాము కరిచినోడికి ఒంటినిండా గాయాలెట్లుంటాయని ఆయన అనుమానాలు వ్యక్తం చేస్తూ, తన తమ్ముడి మరణం పాము కాటు వల్ల కాదని, మృతికి గల కారణాలను కనిపెట్టి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతుని సోదరుడు బోయిని లక్ష్మయ్య పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు భూత్పూర్ పీఎస్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## ఉపాధి పనులను వేగవంతం చేయాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**మహబూబ్‌నగర్, మార్చి 28, ప్రభాతవార్త :** ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. శనివారం వెబెక్స్ సమావేశాన్ని నిర్వహించి శానిటేషన్ కార్యకలాపాలు, ఉపాధి హామీ పనులు ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో సంబంధిత అధికారులకు కొనసాగుతున్న పనులను వేగవంతం చేసి సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.